# విత్తనానికి ముందున్న క్షేత్రం

## మరేదీ నాటలేనిదాన్ని శ్రద్ధ మాత్రమే నాటుతుంది


దాజీ


### పూజ్య శ్రీ చారీజీ మహరాజ్

99వ జయంతి సందర్భంగా ఇచ్చిన సందేశం

24 జూలై 2026

# విత్తనానికి ముందున్న క్షేత్రం

## మరేదీ నాటలేనిదాన్ని శ్రద్ధ మాత్రమే నాటుతుంది

ప్రియ మిత్రులారా,

ఒకే ధ్యాన మందిరంలో, ఒకే ప్రాణాహుతిని స్వీకరిస్తూ, అవే మాటలు వింటూ, ఒకే క్షణంలో కళ్లను మూసుకున్న ఇద్దరు వ్యక్తులను ఊహించుకోండి. ధ్యానం తర్వాత పైకి లేచిన ఒకరిలో, మొదటిసారి ఉత్తర దిశను కనుగొన్న దిక్సూచి మొనలాగా, నిశ్శబ్దంగా, తిరిగి మార్చలేని విధంగా ఏదో పరివర్తన జరిగింది. రెండవ వ్యక్తి లేచి, గడియారం వంక చూసి, మిగిలినవారంతా ధ్యానంలో ఏమి అనుభూతి చెందారోనని ఆశ్చర్యపడతాడు. ఆ ప్రాణాహుతి ప్రసారం, ఆ నిశ్శబ్దం, మాటలు, అన్నీ ఒకటే అయినప్పటికీ, తేడా ఒకటి ఉంది. ఏమిటది? దాన్ని అలా ప్రక్కన పెట్టండి. ఈ ప్రశ్నకు మనం తర్వాత వద్దాం.

ఇదే తరహాలో, ఒక పాత్రలోని నీటిలో ఒక బంగాళాదుంపను, ఒక కోడిగుడ్డును ఉడకబెట్టినట్లు ఊహించుకోండి. నీరు, మంట, వండే సమయం అన్నీ ఒకేలా ఉన్నప్పటికీ, బంగాళాదుంప మెత్తబడుతుంది, గుడ్డేమో గట్టిపడుతుంది. మనలో ప్రతి ఒక్కరి లోలోపల కలిగి ఉన్న స్వభావమే, మన అనుభవం మనల్ని మరింత వికసింపజేస్తుందా లేక మరింతగా మూసిపెడుతుందా అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. ఇది ప్రతిభ లేదా అర్హతకు సంబంధించిన ప్రశ్న కాదు; ఈ ప్రశ్న కేవలం క్షేత్రాన్ని గురించి మాత్రమే.

## అనువాదం లేని పదం

మునుపటి సందేశాల శ్రేణిలో, అన్వేషకునికి, ఇంకా ఎదురుచూస్తున్న జీవితానికి మధ్య నిలిచే ఏడు అంతర్గత అడ్డంకుల ద్వారా మనం కలిసి ప్రయాణించాము. కోరిక ఎలా విభజిస్తుందో, సోమరితనం ఎలా నొక్కిపెడుతుందో, సందేహం ఎలా క్షీణింపజేస్తుందో, గర్వం ఏవిధంగా ఆవరించివేస్తుందో, అసూయ ఎలా బలహీనపరుస్తుందో, పూర్వాభిప్రాయం ఎలా కిటికీలను మూసివేస్తుందో, వాటన్నింటికీ మూలమైన భయం, తలుపును లోపలి నుండే ఎలా బంధిస్తుందో మనం చూశాము. 'జీవింపబడని జీవితం'లో, విశ్వాసం అనేది ఆ తలుపును తెరిచే తాళం చెవి అనీ, తెరిచిన ప్రక్క మనకు మొదట కనిపించేది గమ్యం కాదనీ క్షేత్రం యొక్క నాణ్యత అనీ మనం తెలుసుకున్నాం. ప్రాచీనులు దానినే శ్రద్ధ అని అన్నారు.

శ్రద్ధను ఆంగ్లంలో 'ఫెయిత్' అంటారు. కాని అది సంపూర్ణమైన అర్థాన్నివ్వదు. తరచుగా ఫెయిత్ అంటే 'మనం నిరూపించలేనిదాన్ని నమ్మడం' అని వర్ణిస్తుంటారు; అయితే శ్రద్ధ దానికంటే ఎంతో సచేతనమైనది. నమ్మకం, ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి, పట్టుదల, విశ్వసనీయత, అంతర్గత దృఢ నిశ్చయం సమ్మిళితమై ఒకే జ్వాలగా వెలగడమే శ్రద్ధంటే. అది కేవలం మనస్సు ఒక ప్రతిపాదనను అంగీకరించడం కాదు. బుద్ధి అనేది రుజువుని పరిశీలించడాన్ని పూర్తిచేయకముందే, సంపూర్ణ అస్తిత్వం ఆ అంతరంగ సత్యం వైపు తనను తాను మలచుకోవడం అన్నమాట.

పండితులు శాస్త్రాలపై, గురువుపై నమ్మకం ఉంచి, దాని ద్వారా సుసాధ్యమైనదాన్ని సాధించడమే విశ్వాసం అని వివరిస్తారు. ఇప్పుడు సూక్ష్మత, 'నమ్మడం' అనే పదంలో దాగి ఉంటుంది: ఇది ఏదో ఒక ఆలోచనను ఊరికే అంగీకరించడం కాదు; కేవలం వినడమే కాకుండా, స్వానుభవంతో రుచి చూసిన ఒక సత్యం వైపు మన ప్రతి ఇంద్రియాన్ని, శక్తినీ క్రియాశీలకంగా సమన్వయం చేయడం.

అంతర్గత అనుభవ చిత్రణలో మహా రేఖాపటకర్త (కార్టోగ్రాఫర్) అయిన పతంజలి మహర్షి, అత్యున్నత సాక్షాత్కారానికి దారితీసే ఐదు గుణాల పట్టికలో శ్రద్ధను మొదట పెట్టారు. ఆ ఐదు గుణాలు శ్రద్ధ (విశ్వాసం), వీర్య (శక్తి), స్మృతి (స్మరణ), సమాధి

(సంలీనత), ప్రజ్ఞ (జ్ఞానం). ఈ క్రమాన్ని గమనించండి: శ్రద్ధ, ప్రయత్నించడానికి అవసరమైన శక్తిని లేదా సంసిద్ధతను ప్రేరేపిస్తుంది; శక్తి స్మరణను నిలుపుతుంది; స్మరణ సంలీనతగా పరిపక్వమవుతుంది; సంలీనత ప్రజ్ఞగా వికసిస్తుంది. ఈ గొలుసు మొత్తం మొదటి లింకు (శ్రద్ధ) పైనే ఆధారపడి ఉంటుంది. శ్రద్ధను తొలగిస్తే మిగిలినవన్నీ క్రింద అంతస్తులేని మెట్లలా కూలిపోతాయి.

## మీరు ఊహించని విశ్వాసం

శ్రద్ధను మనం తరచుగా భగవంతునిపై, గురువుపై, మన సాధనపై ఉన్న విశ్వాసంగా భావిస్తాం; ఇవన్నీ అందులో ఉంటాయి కూడా. కానీ శ్రద్ధ మనకు మరింత దగ్గరగా, మన నుండే ప్రారంభమవుతుందని తెలిస్తే మీరు ఆశ్చర్యపడవచ్చు. మనలో ఆత్మవిశ్వాసం లేకపోతే, విశ్వాసం లోపిస్తుంది. ఈ మార్గంలో నడవగలమనే మన సామర్థ్యాన్ని మనం నమ్మనప్పుడు, ఆ మార్గం ఎంత ప్రకాశవంతంగా ఉన్నా ఉపయోగం ఉండదు. మనం సరైనదాన్ని ఎంచుకున్నామన్న నమ్మకం లేకపోతే, ఎంత కృప కలిగినా అది మనకు నమ్మదగినదిగా అనిపించదు. ఆ సందేహం మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటుంది; అది అనుభవలేమి వల్ల కాదు, మన స్వీకరిస్తున్నదానిపై మనకే నమ్మకం లేకపోవడం వల్ల.

దీని అర్థం ఏమిటో ఆలోచించండి. 'బలమైన పునాదిని నిర్మించడం' లో, పదకొండు సంవత్సరాలు ధ్యానం చేసినప్పటికీ ఇంకా 'ఇది నిజమేనా?' అని అడిగిన ఆ మహిళ మీకు గుర్తు ఉందా? ఆమె సాధన లోపరహితంగా సాగింది, ఆమెలోని పరివర్తన చుట్టూ ఉన్న అందరికీ స్పష్టంగా కనిపించింది, అయినా ఆమె దానిని

శ్రద్ధను ఆంగ్లంలో 'ఫెయిత్' అంటారు. కాని అది సంపూర్ణమైన అర్థాన్నివ్వదు. తరచుగా ఫెయిత్ అంటే 'మనం నిరూపించలేనిదాన్ని నమ్మడం' అని వర్ణిస్తుంటారు; అయితే శ్రద్ధ దానికంటే ఎంతో సచేతనమైనది. నమ్మకం, ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి, పట్టుదల, విశ్వసనీయత, అంతర్గత దృఢ నిశ్చయం సమ్మిళితమై ఒకే జ్వాలగా వెలగడమే శ్రద్ధంటే.

నమ్మలేకపోయింది. ఎందుకు? ఆ సందేహం తన సాధన గురించి కాదు, స్వయంగా తన గురించే. తాను మారగలదన్న తన స్వీయ సామర్థ్యాన్ని ఆమె నమ్మలేదు. ఆమె మరిగే నీటిలో ఉన్న గుడ్డులా, తనను మృదువుగా చేయాల్సిన ఆ అనుభవం చుట్టూరా గట్టిపడుతూ ఉంది. సందేహంతో వాదించడం ద్వారా కాకుండా, సందేహం లోపలికి చొరబడేందుకు ఒక్క అవకాశం కూడా దొరకనంత దృఢమైన పునాదిని నిర్మించడం ద్వారా, ఆ ప్రశ్న ఉత్పన్నమయ్యేలోపే శ్రద్ధ దానిని పరిష్కరించి ఉండేది.

మనం అత్యంత ముఖ్యంగా వినవలసిన 'శ్రద్ధ' యొక్క కోణం ఇదే: దివ్య సంకల్పానికి శరణాగతి అవ్వడం ఎంత ముఖ్యమో, మనపై మనకు నమ్మకం ఉండటం కూడా ఆధ్యాత్మికతకు అంతే మౌలికమైనది. ఈ రెండూ ఒకదానికొకటి విరుద్ధాలు కావు; వాటిది వేర్వేరు కోణాల నుండి చూడబడుతోన్న ఒకే గమనం. అన్నీ వదిలేయడానికి తగినంతగా మిమ్మల్ని మీరు నమ్మినప్పుడు, అదే శరణాగతి. దైవానుగ్రహానికి తగిన యోగ్యులన్నంతగా మిమ్మల్ని మీరు విశ్వసించినప్పుడు, అది ఆత్మవిశ్వాసం. శ్రద్ధ ఈ రెండింటినీ ఒంటి చేతితో పట్టిఉంచుతుంది.

## క్షేత్రంలో ఏమి పెరుగుతుంది?

విత్తనం తాను పడే క్షేత్రాన్ని ఎంచుకోదు, కానీ అన్వేషకుడు ఎంచుకుంటాడు. అన్వేషకుడు సిద్ధం చేసే క్షేత్రం ఆ తరువాత జరిగే ప్రతిదాన్నీ నిర్ణయిస్తుంది. నిజమైన విశ్వాసం లేనిచోట, నిజమైన ప్రేమ ఉండదు, నిజమైన శరణాగతి కూడా ఉండదు; నిజమైన విశ్వాసం ఉన్న చోట, ఆత్మ యొక్క సజీవ నిర్మాణం ఆవిష్కృతమవుతుంది:

ప్రేమ మొలకెత్తే క్షేత్రమే శ్రద్ధ.
తన దిశను కనుగొన్న ప్రేమే, భక్తి.
ఫలితంపై పట్టును వదిలేసిన భక్తే, శరణాగతి.
ఆ శరణాగతిని కూడా సమర్పణ చేసిన తర్వాత మిగిలేదే లయావస్థ.

ఆ క్రమాన్ని మళ్లీ, నిదానంగా పరిశీలిద్దాం:

శ్రద్ధ ప్రేమకు దారితీస్తుంది.
ప్రేమ భక్తికి దారితీస్తుంది.
భక్తి శరణాగతికి దారితీస్తుంది.
శరణాగతి లయావస్థకు దారితీస్తుంది.

ఒక మొగ్గ పుష్పంలా, అలాగే ఒక పుష్పం పండులా తయారయినంత సహజంగా, ప్రతీ దశ దానికి ముందున్న దశ నుండి రూపుదిద్దుకుంటుంది. ఒక మొగ్గను బలవంతంగా పండుగా మార్చడం మీ వల్ల కాదు. అయితే మీరు క్షేత్రాన్ని సిద్ధం చేసి, సూర్యరశ్మిని తన పని తాను చేసుకోనివ్వవచ్చు.

ఇప్పుడు, ఈ క్రొత్త సందేశ శ్రేణి అంతటా మనల్ని నడిపించబోయే సత్యం ఇదే: లయావస్థ సంభవించినప్పుడు, నిజమైన యాత్ర ప్రారంభమవుతుంది. దయచేసి ఈ వాక్యాన్ని గురించి ఆలోచిస్తూ కాసేపు ప్రశాంతంగా, మౌనంగా గడపండి. దాదాపు అన్ని ఆధ్యాత్మిక సంప్రదాయాలు, బోధనలు లయావస్థే అంతిమ గమ్యస్థానమని సూచిస్తాయి. కానీ ఆ స్థితిని చేరుకున్న మార్మికులు దాని గురించి మరింతగా చెబుతారు: చేరుకున్న ఆ శిఖరాగ్రం గమ్యస్థానం కాదనీ, అదొక ప్రవేశ ద్వారం మాత్రమేననీ వారంటారు. అన్వేషిస్తున్నామని మీరు అనుకున్న ఈ జీవితం ఆ ద్వారానికి అవతల మీ కోసం వేచి ఉన్న అసలైన జీవితానికి ఒక సన్నాహకం మాత్రమే; ఆ సంసిద్ధత, క్షేత్రం యొక్క నాణ్యతలోనే ప్రారంభమవుతుంది.

ప్రేమ మొలకెత్తే క్షేత్రమే శ్రద్ధ.
తన దిశను కనుగొన్న ప్రేమే, భక్తి.
ఫలితంపై పట్టును వదిలేసిన భక్తే, శరణాగతి.
ఆ శరణాగతిని కూడా సమర్పణ చేసిన తర్వాత మిగిలేదే లయావస్థ.

## మందకొడిగానూ కాదు, గుడ్డిగానూ కాదు

నిశ్శబ్ద గర్జనలాంటి సందేశ సూచన ఒకటుంది: విశ్వాసం మందకొడిగా ఉండకూడదు. ఒకవేళ మీ విశ్వాసం అలా మందకొడిగా అనిపిస్తే, దయచేసి మీ లక్ష్యాలను ఒకసారి పునఃసమీక్షించుకుని, వాటిపై తక్షణమే పనిచేయండి. శ్రద్ధ అనేది ఎంతో భక్తిపూర్వకమైనది, దృఢ నిశ్చయంతో కూడినది. గాలి సైతం ఆర్పివేయలేని ఒక దీపంలా అది నిశ్శబ్ద తీవ్రతతో జ్వలిస్తుంది. ఆ దీపం అలా వెలగడానికి కారణం ఆ జ్వాల ప్రచండంగా ఉండడం వల్ల కాదు, అందులోని నూనె లోతుగా, సమృద్ధిగా ఉండటం వల్ల.

అలాగని విశ్వాసం గుడ్డిది కూడా కాదు. అది మీ అంతరంగ ప్రపంచాన్ని సమూలంగా మార్చివేసే ఒక అనుభవంనుండి పుడుతుంది. కేవలం 'నమ్మకానికి', అసలైన 'విశ్వాసానికి' మధ్య ఉన్న వ్యత్యాసం ఇదే. నమ్మకం అనేది ఎవరూ పెద్దగా నిశితంగా పరిశీలించని ఒక కుటుంబ వారసత్వ ఆస్తిలా సంక్రమించవచ్చు. మీ తల్లిదండ్రులు నమ్ముతారు కాబట్టి, లేదా మీ సమాజం నమ్ముతుంది కాబట్టి మీరు నమ్మవచ్చు. ఎందుకంటే ప్రశ్నించడం కంటే నమ్మడం చాలా సులభం కాబట్టి. కానీ శ్రద్ధ అలా పనిచేయదు. అది ప్రత్యక్షంగా పనిచేస్తుంది. మీరు ధ్యానంలో కూర్చుని, ఆలోచనలు సృష్టించలేని, జ్ఞాపకాలు అల్లలేని ఒక సన్నిధిని మీరు నిస్సందేహంగా అనుభూతి చెందినప్పుడు, మీరు శ్రద్ధను నిర్మించడం ప్రారంభించినట్లే. అప్పుడు మీ స్వీయ హృదయమే దానికి సాక్షీభూతంగా మారుతుంది.

అందుకే హార్ట్‌ఫుల్‌నెస్ మార్గంలో ధ్యానం అనేది కేవలం ఒక పద్ధతి మాత్రమే కాదు; అది శ్రద్ధను రూపొందించే ఒక ప్రయోగశాల. సత్యానుభూతి వైపు దారి చూపే ప్రతి ధ్యానమూ, మీ పాదాల కింద ఉన్న నేలకు ఒక పొరను జోడిస్తుంది. కాలక్రమేణా ఆ నేల ఎంత దృఢంగా మారుతుందంటే, ఎప్పటిలాగే సందేహం వచ్చి మీ తలుపు తట్టినప్పుడు మీ గృహం చలించదు. అంటే ప్రతి ప్రశ్నకూ మీరు సమాధానం ఇచ్చారని కాదు; ఆ ప్రశ్నలు చేరుకోలేని ఒక  నేలపై మీరు నిలబడి ఉన్నారని దానర్థం.

## దీన్ని నిరూపించిన జీవితం

ఈరోజు, చారీజీ మహారాజ్ జన్మించి తొంభై తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని మనం వేడుకగా జరుపుకుంటున్న వేళ, ఈ సందేశం వివరించే ప్రతిదానినీ ఒక్కసారి ఆగి, మననం చేసుకోవడం ఎంతో శ్రేయస్కరం. ఆయన సైన్స్ (విజ్ఞాన శాస్త్రం) లో శిక్షణ పొంది, పరిశ్రమల రంగంలో రాటుదేలిన వ్యక్తి. ప్రతి విషయాన్నీ సునిశితంగా పరిశీలించే మనస్తత్వం ఉన్న ఆయన, తన గురుదేవులను కలుసుకున్నప్పుడు ఎన్నడూ గుడ్డిగా విశ్వసించలేదు; ఆయన ప్రతిరోజూ తన స్వీయ హృదయం అనే ప్రయోగశాలలో దానిని పరీక్షించి చూసుకున్నారు. ఆయన శ్రద్ధ ఎప్పుడూ మందకొడితనంతో లేదు, ఎందుకంటే శ్రద్ధ, ఆయన పూర్తి జీవితాన్ని ఆవహించింది. ఆయన హృదయం సిద్ధం చేయబడిన క్షేత్రం. ఎప్పుడైతే దానిపై 'ప్రాణాహుతి' కురిసిందో, ఆ పంట ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్వేషకుల ఆకలిని తీర్చింది. నేటికీ మనకి పోషణనిస్తోంది. తన విశ్వాసాన్ని మెచ్చుకోమని ఆయన మనల్ని అడగలేదు. మన స్వంత విశ్వాసాన్ని పెంపొందించుకోమన్నారు. ఆయనకు మనం అర్పించగల అత్యున్నత నివాళి, శ్రద్ధతో సిద్ధం చేయబడిన మన హృదయమే.

## ధ్యాన మందిరంలోని ఆ ఇద్దరు వ్యక్తులు

మొదట ధ్యానం చేసిన ఆ ఇద్దరు వ్యక్తుల దగ్గరకు తిరిగి వచ్చి, మనం ఏ ప్రశ్నతో ప్రారంభించామో దానికి సమాధానాన్ని వెతుకుదాం. అక్కడ వ్యత్యాసం ఏమిటి? ఆ క్షేత్రమే. ఒకరి హృదయం సిద్ధం చేయబడింది – పరిపూర్ణంగా లేదా పూర్తిగా కాకపోవచ్చు, కానీ అందులో ఒక సుముఖత ఉంది. ఏదో ఒక నిజమైన మార్పు జరగబోవచ్చనే ఒక దృఢ నిశ్చయం, స్వీకరించగల తన స్వీయ సామర్థ్యంపై నమ్మకం ఉన్నాయి. ఆ సుముఖత అనేది ప్రతిభో లేక అదృష్టమో కాదు, అది శ్రద్ధ మాత్రమే. మరుగుతున్న నీటిలో బంగాళాదుంప మెత్తబడినట్లుగా, ఆ హృదయం 'ప్రాణాహుతి' యొక్క వేడికి మృదువుగా మారి, తనకు లభించినదానికి మరింతగా విచ్చుకుంది. మరి ఈ గుణాన్ని అలవర్చుకోవాలనుకుని, దీన్ని ఎంచుకునే వారెవరైనా దీనిని తమలో పెంపొందించుకోవచ్చు.

రెండవ వ్యక్తి హృదయం నిస్సారమైన క్షేత్రం కాదు. ఏ హృదయమూ కూడా పూర్తిగా సారహీనమైనది కాదనే విషయంలో మనం స్పష్టంగా ఉందాం. అది కేవలం సిద్ధం కాలేదంతే; బహుశా అది మరో ధ్యాసలో ఉండి ఉండవచ్చు, స్వీయ రక్షణాత్మకంగా ఉండి ఉండవచ్చు లేదా ‘అతిగా ఆశలు పెట్టుకోకు’ అని లోపల మెదిలాడే గతంలోని ఆశాభంగపు అవశేషాలను మోస్తూ ఉండి ఉండవచ్చు. ఆ గుసగుస మీకు సుపరిచితంగా అనిపించిందా? మనం గత ఎనిమిది సందేశాలుగా కరిగించడానికి ప్రయత్నించిన ఆ భయం యొక్క ఆఖరి ప్రతిధ్వని ఇదే. దానికి పరిహారం ఇప్పటికీ అదే, అది మారలేదు – అదేదో మహా కార్యం కాదు, వెనక్కి తీసుకోకుండా వేసే ఒక చిన్న అడుగు. కాబట్టి, రేపు ధ్యానంలో కూర్చునేటప్పుడు రవ్వంత ఎక్కువ సుముఖతతో కూర్చోండి. హృదయానికుండే రక్షణ స్వభావాన్ని కొద్దిగా సడలనివ్వండి. ఆ కొద్ది ప్రయత్నం సరిపోతుంది. శ్రద్ధ అనేది ఒక్కసారే సంపూర్ణంగా తయారై రాదు; నేలలోని పొరలు లోతుగా మారే క్రమంలాగే, ఒక్కో ఋతువు గడిచే కొద్దీ, ఒక్కో ధ్యానం గడిచే కొద్దీ, దృఢ విశ్వాసంతో కూడిన ఒక్కో చర్య ద్వారా అది క్రమంగా పెరుగుతుంది.

మనమంతా తరతరాలుగా మనకు సంక్రమిస్తూ, అంతరంగంలో లోతుగా వేళ్లూనుకున్న భయాలను మోస్తూ, కాస్త ఓదార్పు లేదా భరోసా కోసం ఎదురుచూసే చిన్నపిల్లల లాంటివాళ్ళం. శ్రద్ధ అనేది ఆత్మ తనకు తాను ఇచ్చుకునే ఒక భరోసా. ఒక చిన్నారి, అనుమతి పొందడం కోసం వెలుపలి ప్రపంచం వైపు చూడటం ఆపి, తన పాదాల కింద ఉన్న నేల ఎల్లప్పుడూ దృఢంగానే ఉందనీ, విశ్వసించబడడానికి ఎదురుచూస్తూ ఎల్లప్పుడూ అక్కడే ఉందనీ కనుగొనే క్షణమే శ్రద్ధ.

క్షేత్రాన్ని సిద్ధం చేయండి. తాను ఎలా మారాలనుకుంటోందో విత్తనానికి ముందే తెలుసనే విషయాన్ని మీరు కనుగొంటారు.

ప్రేమతో, ప్రార్థనలతో,
కమలేష్

# There's More Waiting For You

to go a little deeper

## HEARTFULNESS APP

A Quiet Place to Start

Carry your practice with you — download the free app and connect with a personal trainer anytime.

Free Download. Daily practice. Trainer always Available.

Heartfulnessapp.org

## MASTERCLASSES

Go Deeper at Home

Learn with Daaji relaxation, meditation, cleaning, and prayer through three freely offered video sessions.

Free Videos. Learn from Daaji. 3 Classes.

Heartfulness.org/global/masterclass

## RETREAT

Time for Just You

Step away from the noise and into a peaceful weekend that quietly deepens everything.

Peaceful Setting. Deepen Practice. Weekend Stays.

Heartfulness.org/global/retreat

## HEARTSPOTS

Find a Centre Near You

Your nearest meditation centre is closer than you think at no cost.

6000+ Centres. Heartful Community. Free to Visit.

Heartspots.heartfulness.org

Scan to download the free app, always there when you need it.
Start with a guided session, and let the practice find its own rhythm in you.
The journey inward begins with a single, still moment.

heartfulness
purity weaves destiny